# కూనేశ్వరుడి కబ్బిన అదృష్టం

రిస్టు వాచీ టైము చూసుకుంటూ హడావిడిగా అద్దెకొంపకు తాళంవేసి కాలేజీకి బయల్దేరిన రంగారావు మేడ మెట్లు దిగేందుకు అట్లా కాలు మోపాడో లేదో- కిందనుండి మేడమెట్లెగబాక్కుంటూ రొప్పుతూ పైకొస్తున్న కూనేశ్వరుణ్ణి చూసి, మెట్టుమీద కాలు పెట్టినవాడు పెట్టినట్టే నుంచుని పొయ్యాడు.

"నువు-నువు- వుండవనుకున్నా"- అంటూ రంగారావును తోసుకుంటూ ఎగరొప్పుతూ ఒక్కక్షణం అట్లాగే నుంచుని- చటుక్కున వరండాలో చతికిల పడ్డాడు కూనేశ్వరుడు, రంగారావు వేపు వింతగా చూస్తూ.

కూనాయ్ ఆ మొహం- ఆకస్మాత్తుగా వాడొచ్చి ఆ విధంగా చతికిలపడి పోయినతీరూ నూరుపాళ్ళూ పరిశీలించిన రంగారావుకు గుండెల్లో ఏదో చిక్కబట్టి నట్టయింది.

నిన్న టపాలోనే యీ కూనేశ్వరుడినుంచి తనకు వుత్తరం వచ్చింది. విమానం పగిలి సముద్రంమధ్య పడినట్టు తన బతుకు బద్దలైందని వాడు రాసిన వుత్తరం యింకా తన టేబిలుమీదే వుంది. వివరాలైతే రాయలేదు కాని జీవితం వాడికో దయ్యంలాగ కనిపిస్తున్నట్లు వాడు అడ్డగోలుగా రాసిందాన్నిబట్టి తను వూహించగలిగాడు. అయితే వాడు రాసిన వుత్తరం తనకు పదిరోజుల తరువాత గాని చేరలేదు. ఈ పదిరోజుల్లోనే బాపట్ల తాలూకాలో భయంకరమైన వరద బీభత్సం జరిగింది. కూనేశ్వరుడిది బాపట్ల దగ్గిర ఒక చిన్న పల్లెటూరు. బాపట్లలో ఓ బాంకులో కాషియరుగా వుద్యోగం చేసుకుంటున్నాడు. బట్టతలపై వడగళ్ళవాన పడ్డట్టు- అంతంత మాత్రంగా వుంటున్న వీడి కుటుంబానికేం ప్రమాదం జరగలేదు గదా! వాడు వరదల్లో నానిన మనిషల్లేనే కనుపించాడు. ఇంకేమాత్రం తాత్సారం చేసినా ఏ క్షణాన కూనాయ్ వెక్కి వెక్కి ఏడ్చినా ఆశ్చర్యం లేదు! యింకా నయం! తన భార్య పంకజం యిద్దరు పిల్లల్తో మొన్ననే గూడూరులో వుంటున్న తన అన్నదగ్గరికి వెళ్ళింది. పంకజం అసలే గుండె నీరసం మనిషి!

కూనేశ్వరుణ్ణి జాలిగా లేవదీసి, తలుపు తాళంవేసి సోఫాలో కూచోపెట్టి ఫానువేసి, తను ఎదురు కుర్చీలో కూచుని వాణ్ణి లోతుగా చూశాడు రంగారావు.

"అబ్బ! నాకింకా దడ తగ్గలేదు" అన్నాడు కూనేశ్వరుడు దీర్ఘంగా శ్వాస విడుస్తూ.

"ఫర్వాలేదు - నువు తొందర పడకు - కొంచెం తాపీగానే మాట్లాడు." అంటున్న రంగారావుకు యిటీవల తను వింటున్నా, చదువుతున్నా గుండెజబ్బుల వార్తలు మెదళ్లో గిర్రున తిరిగినై.

"నాకు అప్పుడప్పుడు రక్తంపోటు వస్తూ వుంటుంది! నీ కుటుంబం యిట్లో లేనట్టున్నారే ?" అన్నాడు కూనేశ్వరుడు గుండెమీద నెమ్మదిగా రాసుకుంటూ.

'పంకజం, పిల్లలు గూడూర్దాకా వెళ్ళారు. మరేం ఫర్వాలేదు. కొంచెం ఆగుతే పోటు అదే సర్దుకుంటుంది.' అని రంగారావు అంటున్నా నాలుగిళ్ళవతల వున్న డాక్టర్ని తాను ఎంత తొందరగా వెళ్లి తీసుకువస్తే అంత మేలుంటుందని బుర్రలో తడుతూనేవుంది. కాని రోగిని తను కంగారు పెట్టిన వాడవుతే?

"ఒరేయ్ రంగా, నేను చెప్పే మాటలు నువు నమ్మవు." అన్నాడు కూనేశ్వరుడు రంగారావును సూటిగా చూస్తూ.

"నమ్ముతా-చచ్చినట్టు నమ్ముతా-నువ్వు నన్ను నమ్ము" అని చటుక్కున సమాధానం చెప్పిన రంగారావుకు కూనాయి చూపు, వాడి మాటల ధోరణిలోను విపరీత లక్షణాలేవో వున్నట్టు సందేహం కలిగింది.

"అబ్బ ! నీ మేడ మెట్లు మంద! యిప్పటికింకా దద తగ్గకపోయె !" అన్నాడు కూనేశ్వరుడు.

'అంతే గద! అయితే ఫర్వాలేదు. నీ భార్యా బిడ్డలూ, మీ వాళ్ళంతా బాగున్నారా ?' అడిగాడు రంగారావు కూనేశ్వరుణ్ణి పరిశీలిస్తూ.

"ఆ వరద మండిపోను! ఎంత మందిని పొట్టన పెట్టుకుంది! మేం బాపట్లలోనే వుంటున్నాం గనుక మొల్లోతు నీళ్ళతోనే బయట పడ్డాం. ఒరే రంగా ! మనకు రోజులు కలిసొస్తే నీ మొహాన వుమ్మేసిన వాళ్ళే నీ మెళ్ళో పూలదండ వేస్తారు. తెలిసిందా ! సరిగ్గా నాకదే జరిగింది !" అన్నాడు కూనేశ్వరుడు కొంచెం కళ్ళు పెద్దవి చేస్తూ.

"ఒరేయ్ కూనాయ్. నీకి జన్మలో మంచి రోజులు వచ్చినయ్యాని నేను వింటం జరుగుతే నీ కోసమన్నా తిరుపతి వెళ్ళి జుట్టు తీయించుకొస్తా! యీ వరద సందర్భంలో ఘోరపాటున నీకేమన్నా పెట్టెలు దొరకలేదు కదా !" అనడిగాడు రంగారావు, కూనేశ్వరుణ్ణి సందేహంగా చూస్తూ.

'ఛీ ఛీ! అంత ఖర్మేం పట్టలేదు ! నాకు రెండు లక్షల ఎనభైవేల ఓ లాటరీలో వచ్చింది !' అనేశాడు కూనేశ్వరుడు, నూట ఎనభై డిగ్రీలమేర చూస్తున్న కళ్ళతో !

"చంపేశావు!" అనో కేక పెట్టి కుర్చీకి అంటుకుపొయ్యాడు రంగారావు.

"మన ముఖ్యమంత్రి తన స్వహస్తంతో చెక్కు నా చేతికిచ్చాడు! ఆ చెక్కును బాంకీలో నా ఎక్కౌంటులో వేసుకున్నా!" అన్నాడు కూనేశ్వరుడు చిరునవ్వుతో.

కొన్ని క్షణాలపాటు కూనేశ్వరుణ్ణి నఖశిఖ పర్యంతం ఎర్రబడే కళ్ళతో ఎగాదిగా చూసి ప్రస్తుతం జరిగిందంతా నెమరేసుకుని, వరద వార్తలు తప్ప తను యితర విషయాలను పేపర్లలో అంతగా పట్టించుకోక పోయినా కూనాయ్ చెబుతున్నది అక్షరాలా నిజమై వుంటుందని నమ్మాడు రంగారావు. ఎందుకంటే అకస్మాత్తుగా చవు కబురు విన్నా, లాట్రీలో లక్షలొచ్చినయ్యాని తెలిసినా ఏమనిషయినా షాకు తింటంలో ఆశ్చర్యం లేదు. బహుశ కూనేశ్వరుడికి బాపట్లలో తగిలిన షాకు మద్రాసుదాకా వెంటాడినా ఆశ్చర్యపడనవసరం లేదు.

"నువు నూరేళ్ళు బతుకు! నీలాంటి అదృష్టవంతుడు కొన్ని లక్షలమందిలో ఒక్కడే వుంటాడు! లాట్రీ ధనదేవత లక్షలమంది అభాగ్యుల్లో ఒక్కణ్ణి వరిస్తుంది. నీ దరిద్రం తీరినందుకు నిన్ను మనసారా అభినందిస్తున్నా!" అన్నాడు రంగారావు.

"నువు నన్నభినందిస్తున్నందుకు నా కెంతైనా సంతోషంగా వుంది! కాని యింతట్లో నా దరిద్రం నిజంగా తీరిందా అనే ప్రశ్న నన్ను వెంటాడి పీడిస్తున్నది. యీ లాట్రీతో నా మనసదోరకంగా తయారైంది! నాలో ఏవో కొన్ని పింత అల ఒళ్ళు బయల్దేరినై!" అన్నాడు కూనేశ్వరుడు, రంగారావునదోరకంగా చూస్తూ.

"నీ మనసేదో రకంగా తయారవటం పరమ సహజం! అందుకు నువేం కంగారు పడక్కర్లేదు! నీ స్థితి నేను తేలిగ్గా అర్థం చేసుకోగలను! జిహ్వ చాపల్యంతో మృత్యువాతను పడినవాడు, ఎన్నో రుచిగల పదార్థాలని ఒకేసారి తినాలని కొట్టుకులాడ్తాడు! దరిద్రంలో చస్తున్నవాణ్ణి ధనదేవతొచ్చి ఆలింగనం చేసుకుంటే, ఆ చస్తున్నవాడు నిటారుగా లేచికూచోటమే కాదు. వూహాకందని నూతన శక్తులేవో వాడినావహిస్తయ్! అంచే అలాంటి శక్తులేవో నీలో ఆవిర్భవించినై గనక అలజళ్ళుంటం సహజం!" అన్నాడు రంగారావు.

"సైకాలజీ గురించి కవిత్వ ధోరణిలో నువు చెప్పింది బాగానేవుంది. నాకు నిజంగా ఏ కేసుల్లోనో రెండు మూడు లక్షలు తగుల్తే నేను చేయవలసిన పనను గురించి కొన్ని ఆలోచనలుండేవి! చిత్రమేమిటంటే తీరా నాకా అదృష్టం అబ్బేసరికి ఆ ఆలోచనల్లో ఒక్కటైనా నన్ను తాకటం లేదు". అన్నాడు కూనే

శ్వరుడు, రంగారావును వింతగా చూస్తూ.

"అవును కాకపోవచ్చు. మచ్చుకు వాటిలో ఒక్క ఆలోచనైనా నాకు వినిపిస్తే నిన్ను కొంతైనా అర్థం చేసుకుంటా!" అన్నాడు రంగారావు.

"ఒరే రంగా, నీకన్నా నాకాప్తమిత్రుడింకోడు లేడు. దాపరికం లేకుండా ప్రస్తుతం నన్నొచ్చి అంటుకున్న ఆలోచనల్ని గురించి నీకు చెప్పేస్తా. ఏ రేసుల్లోనో లాట్రీల్లోనో, ఛాన్సు తగల్టం తప్ప నా జీవితాన్ని నా వుద్యోగంతో గట్టెక్కించగలననే ఆశ నాకే కోశానా లేకుండా పోయింది. దైవికంగా యిప్పుడు నాకా ఛాన్సు తగిలినమాట నిజమే. చేసిన అప్పులు నిలువునా వొల్చుకున్న నా భార్య తాలూకు నగలు, నేను బ్యాంకు డబ్బు తీసుకున్న సందర్భంలో నా మామ నన్నాదుకున్న తాలూకు డబ్బు మొత్తం ఎవర్ది వారికి వడ్డీతోసహా తీర్చివేద్దామనుకోవడమే కాదు, ఎవరైనా అభాగ్యుల అవసరాలకు కొంచెం మొత్తానిద్దామనుకున్నాను కూడా. కానీ యిప్పట్లో ఆ ఆలోచనలవల్ల అంత గట్టి ప్రయోజనం వుండదని నాకు తోస్తున్నది. ఎందుకంటే నా జీవితానికో వెలుగుబాట ఏర్పడాలంటే యిప్పుడు నా చేతికొచ్చిన ధనం యింకోసారి లభ్యంకావటం కల్లోనిమాట! ఆ బాట ఏర్పడ్డానికి ఎంతో కాలవ్యవధికూడా అవసరంలేదని నాకు తెలుసు. అది ఏర్పడిన మరుక్షణం నేను ఋణవిముక్తుణ్ణి కావటమే కాదు, పది కుటుంబాల్ని తేలిగ్గా పోషిస్తా. బహుశా నేనంటున్నది నీ కిప్పట్లో అర్థం కాకపోవచ్చు" అన్నాడు కూనేశ్వరుడు గంభీరంగా చూస్తూ.

"ఇందులో అర్థం కానంత గూఢార్థాలేమున్నాయిరా కూనాయ్! నీ చరిత్రకు బీజాలెక్కడేర్పడి ఎటుగా ప్రయాణిస్తున్నదీ నాకు కళ్ళకు కట్టినట్టు తెలుస్తున్నది! మంచీ చెడూ, నీతీ అనే మాటల విలువ నీకు పట్టింపు వుంటే నీ ఆలోచనలు యింకో రకంగా వుంటాయ్. జూదాలకు రేసులకూ నీ భార్య నగలన్నీ వొలిచేశావంటే నువ్వు గోహత్య చేసినంత మహాపాపం చేశావు! బెంగుళూరు రేసుల్లో క్షవరం చేసిన బాంకి డబ్బు తీరా బాంకివాళ్ళు పసిగట్టి నీ కుతుక పట్టుకునేసరికి, కాస్త గోప్యంగా బతుకుతున్న నీ మామ నందులోకి లాగి, నువు బయటపడి, ఆయన పరువు నులికేసి దండానారేశావు! ఓరే కూనాయ్! నలుగురిచేత నీ అంత మంచివాడు లేడని మెచ్చుకునేందుకు చికిత్స చేయడానికి యిప్పుడు నీ చేతిలో మంచి మందు దొరికింది! యీ సదవకాశాన్ని నువ్వీనాడే వుపయోగించుకో!" అన్నాడు రంగారావు.

"ఆ చికిత్స నువ్వూ నేనూ చేయించుకోకుండానే జరిగింది. నాకు లాట్రీలో

రెండు లక్షల ఎన్నభైవేలొచ్చిందని వినడమే తడవుగా నన్ను తిట్టిన వాళ్ళంతా మిడతలల్లే నా దగ్గరవాలి, విప్పారిన మొహాల్తో నన్నభినందించారు! నాకు పరిహారం లేదని రాసిపెట్టినవాళ్ళే ధనదేశాొచ్చి నా వళ్ళో కూచోటం చూసే సరికి వెంటనే ఆ రాసింది వాళ్ళే తుడిచేసుకున్నారు. ఒరే రంగా. యిది డబ్బు. ఎన్ని అవినీతుల్ని, పాపాల్నయినా యిట్టే హరించేస్తుంది. చేసిన సహస్ర పుణ్యాలను ఒక్క పాపకార్యం తుడిచేస్తుందనే వాక్యకు యిది ప్రత్యామ్నాయ సిద్ధాంతం. అదే డబ్బు సిద్ధాంతమనే నిజాన్ని నేనెప్పుడో తెలుసుకున్నా. అందుకే డబ్బార్జనకోసం నేన్నాయుధాల్నయినా ప్రయోగించా! రేపు ఎట్లా గడుస్తుందా అనే పీడా దృశ్యాలు ప్రత్యక్షమయ్యే నాకు, తెల్లవార్లేస్తే బాంకు వుద్యోగంలో, వేలు లక్షలు బొత్తులు కట్టి యింకొకరికోసం భద్రపర్చడం నాకెంత బాధాకరంగా వుంటుందో నేనెవరికీ చెప్పలేను! ఒక్కో లక్షాధికారి మా బాంకులో అడుగుపెడ్తుంటే ఏజంటు దగ్గర్నుంచి మా ఎకౌంటెంట్ను వరకూ ఎవరో తన్నినట్లు కుర్చీల్లోంచి దండాలు పెట్టడం నేను రోజూ చూస్తూంటా! కొందరు మా బాంకిలో వేలుకొద్దీ అప్పులు తీసుకుని, మరదేం వ్యాపారాలు చేస్తారో ఏమో, వారం తిరక్కముందే యిట్టే ఆ అప్పులు తీర్చేసి, వేలు లాభాలు చేసుకోడం నాకెంత ఆశ్చర్యం వేసేదో! యింతకీ ఒక్క మాటలో నీకు క్లుప్తంగా చెప్పాలంటే, రోజూ వేలకొద్దీ పచ్చనోట్లు నన్ను తాకుతూ పక్కన పడిపోతయ్యేగాని నన్ను కన్నెత్తయినా చూడవే! అందుకే ఆ ధనదేవత నన్ను కటాక్షించి తీరాలనే నిశ్చయానికొచ్చా. చివరకది జరిగిందికూడా! ముందు జరగబోయేదికూడా అదే!" అన్నాడు కూనేశ్వరరావు.

'ఒరే కూనాయ్! నువ్వు లక్షచెప్పు. నీమతం అంటే డబ్బుకోసం నువ్వు అవలంబించే పద్ధతుల్ని మటుకు నేను సమర్థించలేను" అన్నాడు రంగారావు.

"అంటే నేను చచ్చీచావకుండా సంకెళ్లేసుకుని ఆ బాంకి వుద్యోగంలోనే నల్లి మాడినట్టు మాడమంటావా!" అనడిగాడు కూనేశ్వరుడు.

"అని నేననటంలేదు. నిత్యావసరాలు తీరని కొన్ని లక్షలు కోట్లమంది మన దేశంలో వున్నారు. వాళ్ళస్థితి మెరుగుపడేందుకు పరిస్థితులు మారడం అవసరం కూడా. మనం వాచిపోయిన స్వాతంత్ర్యం మన దేశం పొందినాక వాళ్ళ స్థితి మెరుగైందని నేననటం లేదు. కానీ యీ అవసరాలు తీరని వాళ్ళంతా అవినీతికి జూదాలకీ పూనుకుంటే మనం ఎక్కడికి పోతున్నాం అనే నేనంటం". అన్నాడు రంగారావు.

"ఒరేయ్, నీకా గిట్టని అవినీతి, జూదాలనే మాటలకర్థం ఏమిటనడుగుతున్నా. ఆ మాటలు మనకామోదకరమైనవిగా మన ప్రభుత్వం, మన ప్రజలూ ఎప్పుడో ఒప్పుకున్నారు. నువ్వింకా వాటిని పట్టుకుని వేళ్ళాట్టం నాకేమంత వివేకంగా తోచడంలేదు. మనదేశంలో తాగేందుకూ, జూదాలాడేందుకూ, క్లబ్బులకూ, రేసులకూ, లాట్రీలకూ, మన ప్రభుత్వం మంజూరు చేసిన లైసెన్సులున్నాయ్. లైసెన్సుకు లోబడిన పై అలవాట్లన్నీ నాకున్నాయ్. అందుకు నువ్వు నన్ను తప్పుపట్టడం పొత్తిగా అర్థరహితమైందని నువ్వు వొప్పుకోడం మంచిది. నేను బి. ఏ. ఎకనమిక్సు ప్రెసిడెన్సీ ఫస్టున పాసైనాననే విషయం నీకు తెలిసిందే. నాకీ పిండాకూడు యోగ్యత ధనార్జనకు ప్రతిబంధకమని నాకీమధ్యే కనువిప్పయింది. ఎందుకంటే ఏ యోగ్యతలతో నిమిత్తంలేకుండా లక్షలు గడించేవాళ్ళ సొమ్ము భద్రంగా వాళ్ళపేర కట్టలు కట్టేందుకే నా వుద్యోగం పరిమితమైందని తెలిసిన మరుక్షణం నా వొంటినిండా చీమలు, జెర్రులు పాకుతున్నట్టనిపించింది. అందుకే నాకు పట్టుకున్న వ్యాధి నివారణకు రేసులు లాట్రీలకు మందులేదనిపించింది ఇందాక నువ్వన్నావే డబ్బు మానవుడిలో నూతన శక్తుల్ని పుట్టిస్తుందనీ, ఆ శక్తుల్ని పరీక్షించేందుకే నేను మద్రాసు వచ్చింది!" అన్నాడు కూనేశ్వరుడు.

"ఒరేయ్! కూనేశ్వరుడూ! అప్పుడు నేను నిన్ను కొంత అర్థంచేసుకున్నా! నీ మేధస్సు గాడి తప్పిందనడంలో నాకేమాత్రం సందేహంలేదు. బొంకు బొంకిన కొద్దీ నిజమైనట్లు భ్రాంతి కలిగించినా బొంకు బొంకేననే నిజంతో పాపం నీకు నిమిత్తం లేదని నాకు తోస్తున్నది. ప్రతి బూతునూ, అవినీతినీ, హత్యల్ని కిరాతక చర్యల్ని, హింసనూ, మంచిని చెడుగానూ, చెడును మంచిగానూ, సమర్థించి నమ్మేందుకు మన భాషలో వచ్చేన్ని మాటలూ, వాటిని పంపిణీ చేసేందుకు తల వెంట్రుకలన్ని పత్రికలూ, వేదికలెక్కి గొంతులు చించుకునేందుకు సరిపడినన్ని ముఠాలు మనకు కొల్లలుగా వున్నయ్! బౌద్ధులు, శైవులు, వైష్ణవులు ఒకరి గొంతు ఒకరు పిసికినా, హిందువులూ, ముస్లిములు, యివాళ నడివీధుల్లో హత్యలు చేసుకుంటున్నా ఎవరి చర్యలు వారికి సమర్థనీయంగానే వుంటయ్! అట్లాగే యీనాటి రాజకీయ ముఠాలు కూడా ఒక ముఠా వార్ని యింకో ముఠావారు ఎవరు ఎవర్ని దుమ్మెత్తి పోసినా, కుతికలు కోసినా ఎవరి ప్రయోజనాల్ని వారు వెనకేసుకొని సమర్థించేందుకు, ఎన్ని మాటలు, ఎన్ని పత్రికలు ఖరాబు చేస్తారో మనం నిత్యం చూసే విషయమే. వేల మొత్తాల్లో జూదాలు నడిచే క్లబ్బులు,

రేసులు, లాటరీలు, తాగుడువల్ల ప్రజా సౌకర్యాలు తీర్చేందుకు ప్రభుత్వానికి రాబడి వుంటుందని ఎప్పుడైనా యెవరైనా కుతర్కం చేస్తే చేయవచ్చునుగాని, ఆ చెత్తంతా మన హీనస్థితిని నిరూపించేందుకు మచ్చుతునకలుగా ఉపయోగ పడతాయనేది మటుకు ఖాయం. నేననేదల్లా నీ భార్య నగలమ్మి, నీ మామను ముంచి బ్యాంకు డబ్బు అపహరించీ, వాళ్ళచేత వుమ్మేయించుకొని మటుకు, నీ వెలుగు బాటల సంగతి చూసుకోవద్దని. నాకు కాలేజికి టైమయింది. నువ్వు నాతోవచ్చి యేవన్నా తిని, తాళాలిస్తా. యిక్కడికే వచ్చి గమ్మున పడుకో, సాయంత్రం నేనొచ్చేదాకా!" అంటూనే లేచాడు రంగారావు.

"ఎక్కడికిరా నువ్వు పోయేదీ— నువా విధంగా త్రిశంకు స్థితిలో నన్నొదిలేసి నీదార్న నువ్వు పోతే నేను బాధ భరించలేను దగ్గరెక్కడైనా ఫోనువుంటే కాలేజికి సెలవు చెప్పి, కొంచెం కాఫీ టిఫినులాంటివి ఏర్పాటు చేయిస్తే నీ అంత నీతిపరుడు యింకోడుండడు" అన్నాడు కూనేశ్వరుడు.

ఆ మాటకొస్తే కూనేశ్వరుడి లోతు సొంతం చూడంది తెంచేసుకున్నట్టు తను కాలేజీకి వెళ్ళటం రంగారావుకు అంత రుచించలేదు.

"సరే, యివాళ నువు వెనకటి కూనాయివి కాదాయె! లక్షాధికారివై పోతివే మరి? ధనదేవత నిన్నేమి ఘనకార్యాలు చెయ్యమంటుందో. నీ అలజళ్ల నైజమేమిటో ఆసాంతం తెలుసుకోంది నాకుమటుకు కాలాడుతుంది్రా కూనాయ్! కింద యింటివాళ్ళకు ఫోనుంది, ఆ చేత్తోనే వాళ్ళబ్బాయి నెవరైనా హోటలుకు పంపే ఏర్పాటుకూడా చేస్తా! నువీలోపు, అక్కడే తువాళ్ళున్నాయ్, ఆ స్నానాల గదిలో ఒళ్ళు శుద్ధిచేసుకో" అని మెట్లుదిగి కిందకి వెళ్ళాడు రంగారావు

ఓ అరగంటలో కాఫీ, టిఫెన్లయినాక నసాళం అంటేట్లు సిగరెట్టు దమ్ము పడ్తున్న కూనేశ్వరుడికి రంగారావెంత సేపటికీ కప్పులూ, ప్లేట్లూ కడిగి సర్దటం నుంచి బైట పడకపోవడం, కొంచెం విచారం కలిగించి, కేకేశాడు. "ఒరే రంగా, నువా తెలిసీ తెలియని ఆడపన్లు చేయటం నేను చూళ్లేను. నువు ఎంత సర్దినా అవి వుండవలసిన తీరుగానే వుంటాయిగాని, యిటొచ్చి కూచో!"

"నీకేం లక్షాధికారివి! మా ఆవిడ క్యాంపుకు వెళ్ళినా, ఆవిడ వాసన నన్నంటిపెట్టుకునే వుంటుంది. తను మళ్ళీ తిరిగి యింటికి వచ్చేప్పటికి పెట్టిన వస్తువు పెట్టినచోట వుండటమూ, ఇల్లు అద్దమల్లే క్లీనుగా వుండటమూ చూస్తే, ఆవిడ ఆత్మ ఎంత ఆనందిస్తుందో నీకేం తెలుసు!" చేతులు తుడుచుకుంటూ వొచ్చి కుర్చీలో కూచున్నాడు రంగారావు.

'ఒరే రంగా, నేనో గట్టి కార్యాన్ని సాధిద్దామనుకుంటున్నా!' అన్నాడు కూనేశ్వరుడు.

"గట్టి కార్యమా ఘనకార్యమా?" అడిగాడు రంగారావు.

"రెండింటికీ పనికొస్తుంది." అన్నాడు కూనేశ్వరుడు.

"ఏమిటదీ?" అడిగాడు రంగారావు.

"నేనో సినిమా తీద్దామనుకుంటున్నా!" అన్నాడు కూనేశ్వరుడు రంగారావును పరిశీలిస్తూ.

"నిజంగా ఘనకార్యం చేస్తావనే భ్రాంతి కలిగింది. ఒరే కూనాయ్, నీ మనసు నిజంగా బాగా పన్జేస్తున్నదా?" అనడిగాడు రంగారావు.

"నిక్షేపంగా పన్జేస్తున్నది! ఏం సినిమా తీయటం ఘనకార్యం కాదంటావా! అసలు సినిమాలంటే నీకు కిట్టుందో లేదో ముందు చెప్పు." అడిగాడు కూనేశ్వరుడు.

"అది అందరూ చేస్తున్న పనేగదా! యిందులో ఘనతకు సంబంధించిందేముంటుందా అని అన్నానేగాని నువ్వు మరోలా అనుకోబోకు." అన్నాడు రంగారావు.

"నీధోరణి బొత్తిగా నాకు నచ్చటం లేదు. వింతగా కూడా వుంది! నీ వాలకం చూస్తే సినిమాలంటే నీకేదో దొబ్బుడాయున్నట్టుంది! ఎందుకంటే సినిమా పేరెత్తినా, సినిమా మనుష్యుల్ని చూసినా ఎగిరి గంతేసే మనుష్యులు కొన్ని వందలు, వేల మందిని నేనెరుగుదును! వాళ్ళ అభిప్రాయాలు కాదంటావా ఏమిటి ఖర్మ" అన్నాడు కూనేశ్వరుడు.

"అనే ఖర్మ నాకెందుకు! ఫలానా సినిమా బాగుంది. లేదంటే లేదని చెప్పడమే నా వొంతు" అన్నాడు రంగారావు.

"రక్షించావు అయితే సినిమా ప్రభావం నీకు బొత్తిగా తెలియదంటం సబబుగాదు. అన్నట్టు నీకు తెలిసిన కొందరు సినిమా మిత్రులున్నారని లోగడ నువ్వు చెప్పినట్టు కూడా నాకు జ్ఞాపకం" అన్నాడు కూనేశ్వరుడు.

"నేనీ మద్రాసులో మన తెలుగు సినిమాలు చూసేందుకు వాళ్ళే నాకాధారం. ఒక్కొక్కసారి ఒక్కో మన తెలుగు సినిమా చూస్తే వచ్చే వికారం నివారణ చేసుకుంటానికి యింకో సినిమా చూసి చివరకు అదొక అలవాటు కింద చేసుకున్నా" అన్నాడు రంగారావు.

"అది నీ ఖర్మ! లక్షల మంది ప్రజలు చూసి ఆనందించే సినిమాలు

నీకు నచ్చడం లేదంటే అది మీ కాలేజీ తత్వాలకుండే జబ్బేమోనని నా కను
మానంగా వుంది!" అన్నాడు కూనేశ్వరుడు.

"కోప్పడకురా కూనాయ్! మా కాలేజి తత్వం గురించి నీ అంచనా శుద్ధ
తప్పు. కాలేజి విద్యార్థులు సినిమా ప్రేక్షకజనం కాదని నువెందుకు పొరబడ్డావో
నా కాశ్చర్యంగావుంది. వాళ్లు పాఠాలకన్న సినిమాల్ని గురించి సినిమా స్టార్స్
గురించి ఎంతాసక్తితో చదువుతారో నీ దృష్టికి పడకపోవడం వింతగానే వుంది."
అన్నాడు రంగారావు.

"నా దృష్టిన పడినా నాకాశ్చర్యం కలగదు. ఒరే రంగా, నా దగ్గరంటే
అన్నావు గాని, పొరపాట్నన్నా నువ్వు సినిమాల్ని గురించి ఎద్దేవగా బయటెక్క
డయినా అన్నావంటేమటుకు నీ తాట వలిచి నిన్ను ప్రజావ్యతిరేకిగా జమ కట్టేం
దుకు మనుషులున్నారని నీకు చెప్పగలను! ఎందుకంటే యివాళ సినిమాలంటే
వున్న గాఢమైనమోజుతోనే వాటిపై ప్రజలు కనకవర్షం కురిపిస్తున్నారనేది
మటుకు ముమ్మాటికీ నిజం" అన్నాడు కూనేశ్వరుడు.

"పిండాకూడూ బీరాకూడూ! నూటికి డెబ్బయ్ వంతులు సినిమాలు నష్ట
పడుతున్నాయని సినిమా రంగంలోని నా మిత్రులే అంటున్నారు. ప్రతి చెత్త
సినిమాకు చచ్చినా ప్రజలు డబ్బివ్వరని నువ్వు తెలుసుకోడం మంచిది!" అన్నాడు
రంగారావు.

"ఓరి పిచ్చినాయనా! ఆ విషయం నీకన్న నాకు బాగా తెలుసు! వాళ్ళకు
నచ్చిన సినిమాల మీదే కనకవర్షం కురిపిస్తున్నారని నా వుద్దేశ్యంగా నువెందుకను
కోకూడదూ! ఒరే రంగా! సినిమారంగం ఒక వ్యాపార రంగం. ఇతర
వ్యాపారాల్లాగానే దీనికీ లాభనష్టాలు రెండూ వుంటం సహజం. చివరకు సినిమా
తీయటం ఒక లాట్రీలాంటిదనో, రేసులాంటిదనో, జూదమనో ఋజువు చేయ
డానికి నువ్వు ప్రయత్నించవచ్చు. కాని నా కలాంటి మహిమల్ని గురించి మంచి
నీళ్ల ప్రాయంగా తెలుసు గనక నేనంత సులభంగా నీకు లొంగను. అయితే
సినిమా వ్యాపారానికో ప్రత్యేకమైన రక్తమాంసాలతో కూడిన మేలిమి రంగొకటి
వుంది! ఆ మేలిమి రంగు తెరపై అడుగడుగునా కనిపిస్తూ, ప్రేక్షక జనాన్ని
యిట్టే పట్టేస్తుంది. సరైనమాట తట్టక నేను మేలిమి రంగంటున్నాను. నువు
దాన్ని ఎట్టా సర్దుకున్నా నాకభ్యంతరం లేదు! అందుకే సినిమాలకు జనం ఎగ
బడుతున్నారు. ఆ మనుషులు వూరేగింపులు జరిపి, హారతులిచ్చి, బ్రహ్మరథం
పడుతున్నారు! వూరంతా ఆ మనుష్యుల పేర సంఘాలున్నాయని దాఖలాలు చూపిస్తా.

సినిమాకున్న యీ ప్రత్యేక సౌందర్యమే— యీ సౌందర్యమనే మాటకూడా నేను అతికినట్టు వాడకపోతే నువు సరిచేసుకోవచ్చు — నన్ను బలంగా బంధించేసి, నా జీవితానికో పుణ్యం, పురుషార్థాలంటూ ప్రసాదిస్తుందనే గాఢవిశ్వాసం నాలో కలిగింది !" అన్నాడు కూనేశ్వరుడు ఆవేశంతో.

"శుభం! నీ అదృష్ట రేఖల్ని చూసిన నిన్నెందుకు కాదనాలి! నిన్నెంత మంది దుమ్మెత్తిపోసినా లాటరీలో నీకు లక్షలు రాకుండా ఆపగలిగారా మరి! అట్లాగే నువ్వు తలపెట్టబొయ్యే సినిమా వ్యాపారం నీకు ధనవస్తువాహన కీర్తి పుణ్యాలనెందుకు ప్రసాదించకూడదు! యీ సందర్భంలోనే నన్నో చిన్న ధర్మ సందేహంకూడా యింకా పీడిస్తూనే వుంది! నేనడిగిన ప్రశ్నకు నువు వెంటనే సమాధానం చెప్పాలి. అకస్మాత్తుగా నీకు లాటరీలో రెండు లక్షల ఎనభైవేలు వచ్చేసరికి ముందు నీకు అనిపించిందేమిటి ?" అనడిగాడు రంగారావు.

"నా దరిద్రం తీరిందని!" అన్నాడు కూనేశ్వరుడు.

"యిప్పుడూ నీకట్లాగే అనిపిస్తున్నదా !" అడిగాడు రంగారావు.

"అంతకుమించి అనిపిస్తున్నది! ఒరే రంగా! నువ్వుత్త పిచ్చినాయనవి! సందార్భాన్నిబట్టి తెలివితేటలనేవి కొన్ని గీతలమధ్యే గూడుకట్టుకునే స్వభావంగలవి! నీ తెలివితేటలు, మీ కాలేజికి వుండే వాతావరణం గీతల్ని దాటిపోవటం నీ తప్పుకాదు. అందువల్ల రోజూ మార్తున్న యీ లోకానికి నువు పాతవాడివి! నీపాత చూపుకు యీ నాటిలోకం, నీవేపుకన్నా తిరిగిచూడదు. నీవడిగిన ప్రశ్న వుద్దేశ్యాన్ని నేను గ్రహించలేదనుకోకు. నీకో చిన్న విషయం చెబుతా ! డబ్బుకు అయస్కాంత శక్తివుంది. యీ అయస్కాంత శక్తికి కొంత డబ్బును ఆకర్షించే స్వభావంకూడా వుంది. డబ్బు ఖర్చువుతే దాని అయస్కాంత శక్తి దాంనతటదే నశిస్తుందికూడా. అంటే నువు దాన్ని సద్వినియోగం చేస్తే అది నీకొక మూలశక్తిగా వుపకరిస్తుంది! అందుకే నీకు సినిమారంగంలో తెలిసిన మిత్రులున్నారు కనుక వాళ్ళను నాకు పరిచయం చెయ్యమనడుగుతున్నా. అందులో పనికివచ్చే వార్ని ఎన్నుకోవడం నా వంతు. మన పత్రికల ధర్మమా అని సినిమావ్యక్తుల పుట్టుపూర్వోత్తరాల్ని గురించిన విషయ సామగ్రిని నేనెప్పుడో చదివి జీర్ణించుకున్నా! యిహ నువ్వు నన్ను కాదనటానికి వీల్లేదు." అని రంగారావు రెండు చేతులు పట్టుకున్నాడు కూనేశ్వరుడు.

తన కల్లోకూడా అనుకుంటానికి వీల్లేని బదిలీ అయింది రంగారావుకు మద్రాసునుండి. మద్రాసులో ఏ తెగకుచెందిన వారైనా ఎవరి మానాన వారు

గోప్యంగా బతకొచ్చనే అభిప్రాయం రంగారావుకేనాడో కలిగింది. ఏ పొరుగింటి వార్తోనూ ఎవరికీ సంబంధాలు వుండవు. కావాలని పూసుకుంటే తప్ప. అక్కడ యే రాజకీయ మతాలవాళ్లూ నడిబజార్లల్లో ఒకరి గుండాల్నింకొకరు చింపుకొని దుమ్మెత్తిపోసుకోటం, ఏనాడూ రంగారావుకు చూసినట్టు జ్ఞాపకం లేదు విశ్వ ప్రయత్నంమీద ఏణ్ణర్థం దాటినాకగాని తన వుద్యోగాన్ని మళ్ళీ మద్రాసుకు మార్పించుకోలేకపోయాడు రంగారావు

తను బదిలీఅయి మద్రాసునుండి వెళ్లేముందే కూనేశ్వరుణ్ణి సినిమారంగంలో తన మిత్రులకు పరిచయంచేసి వెళ్లాడు రంగారావు. ఆ పరిచయం చేసిన నాలుగో రోజుకే కూనాయ్ తనకు కనిపించి సినిమా వాతావరణంలో తను కొత్తగా కనిపెట్టిన విశేషాలు, టాప్‌స్టార్స్‌తో తను ఎంత పూసుకు తిరుగుతున్నదీ తనకు చెప్పవలసిన పద్ధతిలో చెప్పేసి వెళ్లాడు. యీ ఏణ్ణర్థంలో తను బదిలీ అయిన ప్రాంతానికి వాణ్ణుంచి రెండే వుత్తరాలు తనకొచ్చినై - అదీ తను వెళ్ళిన మూడు నెలలలోపే. తరువాత కూనాయ్ విషయం తనకు తెలియలేదు. ఆ రెండో వుత్తరంలో వాడు తన "లోకేశ్వరీ ప్రొడక్షన్స్" అనేపేర ప్రముఖ స్టార్స్‌ను బుక్‌చేసి అతి త్వరలోనే షూటింగు ప్రారంభిస్తున్నాననీ తనను యిప్పుడందరూ "లోకేశ్వర్" అని పిలుస్తున్నారనీ రాశాడు. తనో ప్రముఖవ్యక్తి నౌతున్నానని సూచించేందుకే కూనా యీ వుత్తరం రాశాడని రంగారావు మనసులో ఎక్కడో ఎందుకో కొద్దిగా తాకినట్టు అనిపించింది.

మద్రాసు వచ్చిన రెండో రోజునే టెలిఫోను డైరెక్టరీలో "లోకేశ్వర్ ప్రొడక్షన్సు" పేరు ఎంత గాలించినా దొరక్క, లోగడ కూనాయ్ తనకు రాసిన ఎడ్రసుకో లోకల్ వుత్తరమ్ముక్క తను మద్రాసు వచ్చినట్టు, అదృష్టవశాత్తు ముందు తను ఖాళీచేసిన ఇంట్లోనే తను మళ్ళీ చేరినట్టు రాసి పడేశాడు రంగారావు తను కాస్త స్థిమితపడేలోపు తన వుత్తరం అందిన కూనాయ్ తన్నొచ్చి కలవగలడనుకున్న రంగారావుకు ఆశాభంగం కలిగింది. అయితే ఒకరోజు తను పాండీబజారు గీతా కేఫ్ దగ్గర వున్నప్పుడు దైవికంగా తన ముందుగా కూనాయ్ కార్లో పోతుంటంచూసి చెయివూపాడు రంగారావు. కానీ కూనాయ్ వెళ్తున్న కారు ఆగకుండా వెళ్ళిపోయింది. తనను కూనాయ్ చూసి వుండడనే సందేహంలోపడ్డ రంగారావుకు బహుశా సినిమా అంతస్థుల్లోవున్న కూనాయ్‌కి ప్రస్తుతం తనతో అంత అవసరం వుండకపోవచ్చు ననే భావంకూడా కలక్కపోలేదు. కానీ తను చూసిన ఆ కార్లో మనిషి నిజంగా కూనాయేనా అనే

స్వల్ప సందేహంకూడా పీడిస్తున్నదే మరి. ఆ మనిషి కూనాయల్లే వున్నా సినిమా వేషగాడల్లే వున్నాడు! ఏమైనా అనుకున్నంత తేలిగ్గా రంగారావుకు కూనేశ్వరుడు కనిపించలేదు.

ఆనాడు సాయంత్రం రంగారావు తీరుబడి చేసుకుని భార్య పంకజం, యిద్దరు పిల్లల్తో మెరీనా బీచ్‌కి వెళ్ళాడు. పిల్లలిద్దరూ సముద్రపు అలలకు కొట్టు కొచ్చిన వింత వింత గవ్వల్ని కుతితీరినన్ని వేటాడి, తడి యిసుకతో పిచ్చిక గూళ్ళు కట్టుకున్నారు. తన పక్కనే కూచుని అడ కబుర్లు చెబుతున్న పంకజం ఎవరో గుంజినట్టు పదిబారల దూరంలో తెలిసిన యిద్దరు పెద్ద ఇళ్ళ ఆడ మను షుల దగ్గిరకెళ్ళి వాళ్ళతో యిచ్చకాలాడుతుంటం అసంతృప్తితో ఆమోదించిన రంగా రావు ఎత్తుగా సంధ్యకాంతుల్లో ఎగిరెగిరి పడుతున్న నీలాల తెల్లటి సముద్రం అలల వైపుకు మెల్లిగా దృష్టి మళ్ళించాడు.

టపీమని ఓ పెద్ద అల విరుచుకుపడిందో లేదో— వులిక్కిపడి తలఎత్తి చూచిన రంగారావుకు తన ఎదురుగా కూనేశ్వరుడు ప్రత్యక్షమైనాడు. తను కార్లో చూసిన మనిషి యీ కూనాయేనని చప్పున అనుకున్నాడు రంగారావు

గడ్డందాకా గొంతుకూ వొంటికి బిగిసిన ఎర్ర పొట్టిచేతుల నైలాను బనీను, కాళ్ళకు అంటకుట్టిన టెర్లిన్ పాంటు, నల్లద్దాల తెల్ల ఫ్రేము గాగిల్సు, పెన్సిల్తో గీసినట్టున్న మీసాలు, కత్తిరించిన అంగుళం చిరుగడ్డం, బ్లాక్ అండ్ వైట్ సిగ రెట్టు డబ్బా, సిగర్ లైటర్‌తో సినిమా నటుడల్లే నిలువునా కనుపించిన కూనేశ్వ రుణ్ణి ఒక్కక్షణం కనురెప్పలాడిస్తూ చూసిన రంగారావు "ఏరోయ్ కూనా- లోకేశ్వర్! అనుకోకుండా యిలా దర్శనమిచ్చావేమిటి?" అని సహంలోనే మాట సవరించుకున్న రంగారావు, కూనేశ్వరుడికి కొంచెం వెనకనే సినిమా స్టార్లల్లే వున్న యిద్దరూ ఆడా, ఒక మొగ మనిషినికూడా గమనించాడు.

కొంచెం దూరంలోనే తెలిసిన యిద్దరు ఆడమనుషుల్తో మాట్లాడుతున్న రంగారావుభార్య పంకజానికి తనభర్తను నలుగురు సినిమా స్టార్సు చుట్టుముట్టడం కనబడింది. ఆ క్షణంనుంచీ ఒక కన్ను అడ మిత్రులకూ, యింకో కన్ను అటు తన భర్తను చుట్టుముట్టిన సినిమా మనుషుల వైపూ విభజించి సతమతమవు తున్న పంకజం, యింకో అరగంటకు తన భర్త సినిమా వ్యక్తుల్నుండి విడుదల కావటం కనిపెట్టి, మిత్రులకు సెలవిప్పించి అరనిముషంలో రంగారావు దగ్గర కొచ్చి వాలింది.

"ఎవరండి ఆ మనుష్యులూ?" మరుక్షణంలోనే అడిగింది పంకజం రంగా

రావును అనుకొని కూచుంటూ.

'నువు నన్ను వదిలేసి వెళ్ళకపోతే నీకే బాధా వుండేది కాదుకదా!' అన్నాడు రంగారావు, పంకజాన్ని మోచేత్తో చిన్నగా పొడుస్తూ!

'అబ్బ వుండండి— యిక్కడి జనం కళ్ళన్నీ వాళ్ళమీదే వున్నాయ్! కొంపదీసి వాళ్ళు సినిమా స్టార్సుకాదు కదా!' అడిగింది పంకజం.

'ఇంకోరి కళ్ళేమిటి ఖర్మ, నీ కళ్ళని ఒప్పుకోరాదు?' అన్నాడు రంగారావు.

"నా కంత ఖర్మేం పట్టలా! ఆ సినిమావాళ్ళను ఎవరైనా యిట్టే పసిగడ్తారు. నా కన్న వెయిరెట్లెక్కువగా! యిహ చెప్పండి వాళ్ళెవరో!" అదిన్న పంకజం.

"అందుట్లో ఎర్రబనీను మనిషి మన కూనాయ్! మిగతా ముగ్గురూ వాడి సినిమా మిత్రులు" అన్నాడు రంగారావు.

"ఎవరు- మీ స్నేహితుడు కూనేశ్వరరావా! ఎంత విచిత్రం! నేను చచ్చినా ఆయన్ని పోల్చుకోలేను! యిప్పుడాయనపేరు లోకేశ్వర్ కాదుటండీ?" అన్నది పంకజం.

"భగవంతుడు నీ కెంత జ్ఞాపకశక్తిచ్చాడో! వాడెప్పుడో రాసిన వుత్తరం లోని ఆ విషయం నాకు జ్ఞాపకంవచ్చాక వాణ్ణి "కూనాయ్" అనబోయి సహంలోనే నాలుక కొరుక్కున్నా" అన్నాడు రంగారావు.

'యింకా నయం! అంతపనీ మీరు చేసుంటే ఆయ నెంత బాధపడుండేవాడో పాపం!' అన్నది పంకజం.

'పాపం వాడిసంగతేమోగానీ, ముందు ప్రత్యక్షంగా నీబాధమటుకు చూశా!' అన్నాడు రంగారావు.

'మరీ చిత్రమండీ మీది! 'కూనాయ్' అని ఆ నోరు సాగదీసి అనుంటే మీకే తెలిసేది! అన్నది పంకజం రంగారావును చిన్నతోపు తోస్తూ.

"ఒప్పుకున్నా! ముమ్మాటికి నీ మాట ఒప్పుకుని తీరాకూడా" అన్నాడు రంగారావు పంకజం పాదం నొక్కుతూ.

"అవునండీ, ఆయన లాట్రీలో వచ్చిన డబ్బుతో సినిమాలు తీస్తున్నాడన్నారు, యిప్పటికే యేం తీసి ఎంతడబ్బు గడించాడో మీకేమన్నా చెప్పాడా!"

"వాడు మొదట ప్రారంభించిన చిత్రమే సహంలో వుందనీ, యిప్పటికి ఏడున్నర లక్షలు ఖర్చయిందనీ అంటాడు." అన్నాడు రంగారావు.

"అమ్మ బాబోయ్! సహానికే అన్ని లక్షల ఖర్చే! లాటరీలో వచ్చింది రెండు లక్షల ఎనభైవేలైతే ఆయనకంత డబ్బెక్కడదండీ?" అడిగింది పంకజం.

"అదేమో నాకు తెలియదు. కూనాయి చెప్పిన మాటలే నేనంటున్నా! యిప్పుడు వాడితో వచ్చిన యింకొకతను కోటీశ్వరుడట. ఆయనతో భాగస్వామిగా యింకో చిత్రంకూడా మొదలుపెట్టాట" అన్నాడు రంగారావు.

"ఇదేం ఖర్మండీ యీయనకూ. ఆ సహంలో వున్నదాన్ని ముందు పూర్తి చేసుకుంటే ఆ పెట్టిన డబ్బు రాబట్టుకోవచ్చుగా? అప్పుడే రెండో చిత్రంకూడా దేనికండి! అస లింతడబ్బు ఎక్కణ్ణించి వొస్తున్నదో యీయనకు" అనడిగింది. పంకజం.

అసలు నువ్వడుగుతున్న ప్రశ్నలన్నీ నేను అడక్కముందే కూనాయ్ స్థితే విటో కొంత నేనర్థం చేసుకున్నా. ప్రస్తుతం వాడు నడిసముద్రంలో వున్నా, నేను మాత్రం పసికట్టకూడదని వాడి వుద్దేశం. నేనో యాభయివేలు వాడికి సర్దుతే రెండు వారాల్లో తన చిత్రాన్ని పూర్తిచేసి పెద్దరేటు వడ్డీతో నా అప్పు నాకు నెల తిరక్కముందే తీర్చేస్తానంటాడు!" అన్నాడు రంగారావు.

"ఏమిటీ యాభై వేలేమిటి, మీరు సర్దడమేమిటి? ఆ మనిషికేమైనా మతి పోయిందా ఏమిటి? పాపం, మీ కాలేజీ ప్రొఫెసర్లు ఆయన కంటికి లక్షాధికార్లల్లే కనిపిస్తారా ఏమిటి ఖర్మ! ఆ మాటకొస్తే పట్టిన పదివేలన్నా మనదగ్గిర పుట్టవే!" అన్నది పంకజం.

"అంతకూడాలేదు–చివరకు, అయిదువేలన్నా ప్రస్తుతానికి చూడమన్నాడు. ముందు వాడడిగిన యాభై వేలు నేను గాని, యింకెక్కడైనాగాని యిప్పిస్తే, ఆ కోటీశ్వరుడిచేత నోటు రాయించి యిప్పిస్తానన్నాడు" అన్నాడు రంగారావు.

"అదేమిటండి మరీ వింతగా వుంది! ఆ కోటేశ్వరుడికి నోటురాసి యిచ్చే ఖర్మేం పట్టిందండి! పుష్కలంగా వున్నవాడాయను మరి?" అన్నది పంకజం.

"ఆయనకు అవసరానికి అంద లేదంటాడు. నామానాన నేను గోప్యంగా బతుకుతున్నవాణ్ణి. నన్నభాసు చేయవద్దని చెప్పా. సహం చిత్రానికి తనకు ఏడున్నర లక్షలు ఖర్చయిందన్న నోటితోనే నేను యాభై వేలు యిప్పిస్తే రెండు వారాల్లో మిగతా చిత్రం పూర్తిచేస్తానని వాడనగలగడమే నాకు మరీ ఆశ్చర్యం కలిగించింది. అందుకే కూనాయ్ నడిసముద్రంలోపడ్డ మనిషల్లే కనుపించాడని చెప్పింది!" అన్నాడు రంగారావు.

"నిక్షేపంగా చేతికొచ్చిన రెండులక్షల ఎనభై వేలు ఎన్నేళ్లు తింటే తరిగేను!

పాపం ఆయన భార్యా బిడ్డలెట్లా వున్నారో" అన్నది పంకజం నిట్టూరుస్తూ.

"అదే నేనూ ఆలోచిస్తున్నా. కాని ఆ సహంలో వున్న చిత్రాన్ని పూర్తిచేసి కూనాయ్ కుబేరుడు కాడని నువ్వూ నేను ఎట్లా చెప్పగలం? ఇదిగో పంకజం పిల్లలింకా యిక్కడే వున్నారు పిల్చుకురా. ఇంటికి వెళ్దాం" అన్నాడు రంగారావు చీకట్లో ఎత్తుగా తెల్ల నురుగుల్తో పడ్తున్న సముద్రం అలలవైపు చూస్తూ...

★